వల్లూరి కృష్ణారావు

ఆ ఊరు చాలా చిన్నది. నాగరికత ఆ ఊరును బాగా అలుముకున్నట్లు పంతులమ్మ వస్తేనేగాని తెలియలేదు అంతవరకు. మగతగా పడిఉన్న ఆ ఊరుకు గిలిగింతలు పెట్టింది పంతులమ్మ! ఒకరితో ఇంకొకరికి సంబంధంలేని ఆ గ్రామవాసులలో పంతులమ్మ పరోక్షంగా సంబంధం కలిగించింది. ఎన్నడూ ఇంతవరకూ పోటీ లేకుండా వస్తున్న ప్రసిడెంటు అపూర్వబాబుకు జమిందారుతమ్ముడు కామేశం విపరీత బుద్ధిపుట్టి పోటీగా నిలబడ్డం ఆ ఊరిలో చైతన్యం కలిగిందనడానికి ప్రబల నిదర్శనంగా భావించారు అపూర్వబాబులాంటి కొంతమంది. ఇంటర్మీడియట్ పరీక్ష తప్పిన రామంలాంటివారు సాయంకాలం కాగానే బడివైపు షికార్లు ప్రారంభించారు. రావిచెట్టుక్రింద బండరాయి వేదికఅయి ఊరుకొంది.

పంతులమ్మ ఏమీ వలితిమనిషి కాదు. పట్టి సాదాస్త్రీ. తనడ్యూటీ ఏమిటో తప్ప ఇతర గొడవలు పట్టించుకోని పడుచు. కాని ఆమె కుమారి. ఇదెంతో ఆహ్లాదకరమైన విషయంగా భావించారు కుఱ్ఱమూక! "ఆ!" అని అదిలిస్తే ఆగే యువకజనం ఇప్పుడు పెద్దలమాటలు ఖాతరుచేయకుండా కాలర్లు పైకిపెట్టుకు తిరుగుతున్నారు. ఆమె రాకతో అనేక మార్పులు కలిగినట్టు అనుకున్నారు అంతా!

ప్రసిడెంటు అపూర్వబాబు చాలా మంచివాడనే భావన అందరికీ ఉంది. అపూర్వబాబునుగురించి రెండు విషయాలు మనం తెలుసుకుంటే మంచిది. అపూర్వబాబుకు మంచి ఆస్తిలేదుగాని తనకు సరిపడే ఆస్తిఉంది. ఆదర్శాలుగల యువకుడు. కాని ఇంతవరకు తాను ఊరుకోసం పాటుపడవలసిన అవసరం కనపడలేదు. పోతే ఊరు చాలా మామూలుగా, సాఫీగా పని చేసుకుంటోంది. తను కలుగచేసుకోవలసిన అవసరం కలుగలేదు. అంచేత తనఇంటిలోని పెద్ద లైబ్రరీని ఉపయోగించుకుంటూ కాలక్షేపం చేయసాగాడు. పంతులమ్మ ఆ ఊరుకువచ్చి 'డ్యూటీ'లో చేరగానే తను స్కూలుకు వెళ్ళాడు. బసవపున్నయ్యగారు హెడ్మాస్టారు. చక్కటి పంతులంటారు. ఆయన పంతులమ్మకు అపూర్వబాబును పరిచయంచేశాడు. "ఈయన అపూర్వబాబు. మన ఊరు ప్రసిడెంటు. ఆదర్శాలకోసం జీవితాన్ని కూడా త్యాగం చేయడానికి వెనుదీయరు" పంతులమ్మ ముసిముసినవ్వులు నవ్వింది. అపూర్వబాబు అంతలో కలుగచేసుకొని...

"ఈయన అభిమానం అటువంటిది. నాకేమీ ఆదర్శాలులేవు. చాలా మామూలు మనిషిని." పంతులమ్మ చిరునవ్వును పెదాల దగ్గరకు తెచ్చుకొని తిరిగిలోపలకు మళ్లించింది. సన్నగా అంది పంతులమ్మ.

"మీ పేరు చాలా క్రొత్తగా ఉంటుంది కదూ." అని కళ్లు అపూర్వబాబుకళ్లలో ఒక్కక్షణం ఉంచి తిరిగి బసవపున్నయ్యగారి వైపుచూసింది.

అపూర్వబాబుకు ఏదో ఉత్సాహం వచ్చింది. పంతులమ్మ ఎంతో 'షార్పు' అనుకున్నాడు, అపూర్వబాబు.

"అవును...ఈ పేరును నా మేనమామ పెట్టాడు. ఆయన కవి. నాకు చిన్నప్పుడే తల్లి, తండ్రిపోయారు. వారుపెట్టిన పేరు సన్యాసి. అది మీకుతప్ప ఇంకెవరికీ తెలియదు." పంతులమ్మ తిరిగి నవ్వింది. కాని తాను తెలుసుకోగలిగింది అపూర్వబాబు క్షణక్షణానికి తనదగ్గరసా రావడానికి ప్రయత్నిస్తున్నాడని. పంతులమ్మ ఈసారి తెలివైందని ఋజువుపరచుకొంది అపూర్వబాబుదగ్గర.

"రెండుపేర్లకు మీరు తగియుంటారు." ఫెళ్లున నవ్వింది. బసవపున్నయ్యగారుకూడా నవ్వారు. అపూర్వబాబుకూడా నవ్వాడు. నవ్వి "అవును. తగియుండడంకాదుగాని తగియుండేలా చేసుకొన్నాను. నాకు ఎప్రక్కనా అనేవారు లేరు. సన్యాసి కయినా ఉంటారేమో ఏ ఒక్కడో, అరో, భస్తే ఏడవడానికి. ఇక పోతే నా మేనమామ పెట్టిన పేరుకు కొంతవిలువ ఇవ్వాలనుకొన్నాను. నాగురించి ఇంతవరకూ, ఇంత వివరంగా ఎవ్వరిదగ్గరా చెప్పలేదంటే మీరు ఆశ్చర్యపడక్కర్లేదు." పంతులమ్మ నోరు తెరచి వింది. అపూర్వబాబు పదినిముషాలు ఉండి వెళ్ళిపోయాడు.

మర్నాడు కామేశంవచ్చాడు. బసవపున్నయ్యగారు నిర్ఘాంతపోయారు. ఎన్నడూ లేనిది... పెద్దలుక్రమంలో...తనపాఠశాలకు వస్తున్నారు. యధావిధిగా బసవపున్నయ్యగారు కామేశాన్ని పరిచయంచేశారు. కామేశం వస్తుంటే...ఏ అత్తరు సాహెబో వస్తున్నాడనిపించింది. బంగారు బొత్తాలు ధగధగ మెరుస్తున్నాయి. జాగ్రత్తగా పౌడరుతో మెత్తబడిన ఆ నున్నటిమొహం తళతళలాడుతోంది. గ్లాస్కోపంచె, బంగారువన్నెగల ఆ సిల్కులాల్చీ, ఆ లేసు గళ్ళ బనీను...కామేశానికి క్రొత్తదనం ఇచ్చింది.

"ఈయన జమిందారుగారి తమ్ముడు, కామేశం. లక్షలకధికారి." అని వేలుపెట్టి నొక్కిచెప్పినట్టు చెప్పాడు బసవపున్నయ్యగారు. పంతులమ్మ నమస్కరించింది. తిరిగి ఇచ్చేశాడు కామేశం. కామేశం డబ్బును మధ్యపెట్టి పంతులమ్మను ఆకర్షింపదలచాడు. పున్నయ్యగారితో అన్నాడు. "అన్నయ్యతో చెప్పకపోయారామాష్టారూ! ఈ షెడ్డులేమిటి పాడు," అని విసుక్కున్నాడు. పంతులమ్మ నవ్వింది. ఆ నవ్వును అపార్థం చేసుకొన్నాడు కామేశం.

"మీ రెక్కడుంటున్నారు."

"క్రొత్తగోడ్డులో!"

"అక్కడ బాగానేఉండచ్చు. మీకభ్యంతరం లేకపోతే..." కామేశం పంతులమ్మ కళ్లలోకిచూశాడు. పంతులమ్మ తెచ్చిపెట్టుకొని ముక్తూనవ్వింది. కామేశం వెర్రెత్తిపోయాడు.

"అప్పుడప్పుడు మాఇంటికి వస్తోండండి." అని కామేశం వెళ్ళిపోయాడు కీవిగా!

ఒకనాడు సాయంత్రం బడినుంచి ఇంటికి వెడుతోంది పంతులమ్మ. తానుమామూలుగా వెడుతోంటే ఎవరో గేలిచేస్తున్న ధ్వనులు వింది. పంతులమ్మ ఖాతరుచేయలేదు. తాను తనమానాన నడుస్తోంది.

ఆ మర్నాటి ఉదయం స్కూలుకు వెడుతున్న పంతులమ్మకు రామం తారసపడ్డాడు. పంతులమ్మను చూచి "గుడ్ మోర్నింగ్" అన్నాడు. తిరిగి అదేమాటను అంది పంతులమ్మ చిలకలా. కాస్సేపాగి...

"ఎవరుమీరు?" అంది.

"నా పేరు రామం. పూర్వం కాలేజీ విద్యార్థిని."

"ఇప్పుడు?"

"వయోజనుడను."

నవ్వింది పంతులమ్మ. రామం పిచ్చవాడయిపోయాడు క్షణంసేపు.

"పరే వస్తాను"

రామం సరేనని...వెడుతున్న పంతులమ్మను ఆపి

"చూడండి..."

"ఏమిటది?" పంతులమ్మ నిర్ఘాంతపోయింది

"ఏమీ లేదు." చప్పగా అన్నాడు రామం

"మీరు భలేవారు."

రామం మరి మాట్లాడలేకపోయాడు. పంతులమ్మ "వస్తానండీ!" అంటూ వెళ్ళిపోబోయింది.

రామం తేరుకొని..."ఇదిగో చూడండీ!"

పంతులమ్మ నవ్వుతూ చూసింది రామం వంక.

"నవ్వకండి గాని...ఒకటి మీతో చెప్పాలనుకున్నాను."

"చెప్పండి..."

"ఏమీ లేదు."

"సరే వస్తాను" అంది నవ్వుతూ.

రామం దెబ్బతిని..."ఏమీ అనుకోరు కదా. సరే అయితే...మీరు అందరితోనూ, అంత చనువుగా ఉండడం మంచిది కాకపోగా ప్రమాదం కూడా!"

"మీతో కూడానా?" పకపక నవ్వింది పంతులమ్మ.

"మీలా, నేను విషయాన్ని తేలిగ్గా విదిలించుకోలేను."

"మీకేమొచ్చింది విదిలించుకోడానికి."

"నాగురించి కాదు...మీ..."

"ఆ!"

"పదిమంది..."

"పదిరకాలుగా అంటారంటారు."

"అవును."

"అన్నివ్వండి...అయినా అందర్నీ ఆడించే కాలేజీ విద్యార్థులు, మీరు ఇంత పిరికివారా?"

"క్షమించండి అందర్లాటి వాడిని కాను."

"ఈ ఊళ్లో వాళ్ళంతా అందర్లాటి వారూ కారు." అని నవ్వింది. తిరిగి అంది. "సరే వస్తానండి థాంక్స్."

పంతులమ్మ తనలో తాను అనుకొంది. అందర్లాంటివాడు కాదు ప్రసిడెంట్ అపూర్వబాబు..అందరు జమిందార్ల బ్బాయిల లాంటివాడు కాదు కామేశం. అందరు కాలేజీ కుర్రాళ్ళ వంటివాడు కాదు రామం. అందరి పంతుళ్ళాంటి పంతులు కాదు పున్నయ్యగారు. అందరి పంతులమ్మల లాంటిది కాదేమో తనుకూడ! నవ్వువచ్చింది తనకు.

రెండుమూడు రోజులయ్యాక అపూర్వబాబు పాఠశాలకు వచ్చాడు. పున్నయ్యగారిని, పంతులమ్మను కలుసుకొని తన పుట్టినరోజు పండగ చేసుకుంటున్నానని టీపార్టీకి రావలసిందని కోరాడు. పున్నయ్యగారు ఆశ్చర్యపోయాడు. అపూర్వబాబుకు పుట్టినరోజు పండగ ఇదే మొదటిది తనకు తెలిసినంతవరకు. టీపార్టీకి అందరూ వచ్చారు. రామం పంతులమ్మ ప్రక్కన కూర్చోవాలని మహా తాపత్రయపడ్డాడు. కామేశం, తన దుస్తులు, మెడలోని బంగారు గొలుసును పంతులమ్మ చూస్తోందో లేదోనని ఖేదపడ్డాడు. ఇక అపూర్వబాబు...నల్లటి లాంగ్‌కోటులో మిలమిల మెరిసిపోతూ, దొరబాబులా పదిమందిలోనూ పెద్దగా పంతులమ్మ ఎదుట తనకు తాను కనపడ్డం గర్వంగా భావించాడు.

కామేశం కూడా టీపార్టీ ఇవ్వదలచాడు. పంతులమ్మను స్వయంగా వెళ్ళి పిలిచాడు. పంతులమ్మ నవ్వుతూ అంది.

"చూడగా మీరూ, అపూర్వబాబుగారూ పోటీ పడినట్లుంది" కామేశం దెబ్బతిని క్షణంలో తెప్పరిల్లి వెంటనే.

"ఎందులో" అన్నాడు.

చూడండి!
దంతక్షయాన్ని ఆపుటకు
విశేషమైన
రక్షక గోడ!*




కోలినోస్ సూపర్-వైట్ టూత్ పేస్ట్
మీ నవ్వుయొక్క మెఱుగును కాపాడును

* లేబొరెటరీలో జరిపిన కె-42 పరీక్ష కోలినోస్ సూపర్-వైట్ (తెల్లని చోటు) దంతక్షయము కలిగించే క్రిములను (నల్లని చోటు) అడ్డుతుంది (బూడిద వర్ణపు పై వృత్తము) అని చూపింది.

పెప్పర్‌మింట్ వంటి చల్లని కమ్మదనమును రుచి చూడండి!




చూడండి...
పట్టుకొనుటకు వీలైన
విశేషమైన మూత!

జియోఫ్రే మేనర్స్ అండ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్,
రిజిస్టర్డ్ యూసర్

GK. 4776

# ★ చక్కిలిగింతలు ★

"అహా! అదికాదు. టీపార్టీలో"

"ఓహో! అదా! అపూర్వబాబుకు నాకు పోలికకట్టారా?" అని అభిమానంవచ్చి అన్నాడు.

"అంటే?"

"చూస్తారుగా! అపూర్వబాబు ఇచ్చినదికూడా ఒక టీపార్టీయేనా? అంటారు మీరే!"

"నేనుఅనడం దేనికీ? మీరేఅంటూంటే!"

కామేశం మరోసారి మొహం ముడిచాడు, పంతులమ్మ తిరిగిఅంది.

"అధైర్యపడకండి ఇవేం ఎన్నికలు కాదుగా! ఇది టీపార్టీ! అఖండంగానే ఉండొచ్చు."

కామేశంకు కోపంవచ్చింది. వెంటనే కోపం మంచిది కాదనుకొని "అదిసరే... వేరే నాకు పనుంది. నేనువస్తాను."

కామేశం చాలా ఘనంగా చేశాడు టీపార్టీ. ఎవరూ ఊహించలేనంత బాగుంది టీపార్టీ. టీపార్టీలో ఇచ్చిన పదార్థాలు నూటికి ముప్పాతిక మందికి కొత్తా, సగానికి పైగా పదార్థాలను ఎలా పుచ్చుకోవాలో కూడా తెలియనిప్రజ ఉన్నారన్నా ఆశ్చర్యపడ నక్కరలేదు.

మర్నాడు రామంవచ్చాడు స్కూలుకు. పంతులమ్మ చిరునవ్వుతో "రాండి" అంది రామానికి ఎంతో ఉత్సాహం వచ్చింది.

"ఏం రామంగారూ! మీరు కూడా టీపార్టీ ఇస్తున్నారా" రామం తెల్లమొహం వేశాడు. తన అసమర్థతను దెప్పుతోందనుకున్నాడేగాని టీపార్టీలంటే ఆమె కంత హితవుగాదని రామానికి తెలియదు. చాలా నింపాదిగా అడిగాడు రామం.

"రేపు మధ్యాహ్నం ఊరు వెడుతున్నారా?"

"ఏం?"

"శని ఆదివారాలు కదా అని..."

"ఏం అయితే వెళ్లాలా?"

"నేను అడిగానని మానెయ్యరు కదా ఖర్మ!" అని నవ్వాడు:

"లేదు-వెడుతున్నాను."

"నేను కూడా వస్తానని చెప్పడానికి వచ్చాను. నాకు పనుంది. వేరే బండి మాట్లాడకండి స్టేషనుకు."

"నాకు సామానుఏమీ ఉండదు. స్టేషనుకు నడిచే వెడదామనుకుంటున్నాను. నాకు నడవడం సరదా."

"నాకూ నిజంగా అంతే!"

"నేను స్టేషనుదాకా మాత్రమే రాగలను:" అతను కళ్ళలోకి చూసి అంది ఆమె.

"అంటే?"

"మిమ్మల్ని దిగబెట్టి తిరిగి ఇంటికివచ్చేస్తాను." ఫక్కుమంది పంతులమ్మ. రామం మెలికలు తిరిగాడు ఆమె హాస్యానికి. రామం, తాపీగా—" నేనూ అదే చేద్దాం అనుకుంటున్నాను. మిమ్మల్ని స్టేషనులో దిగబెట్టి వచ్చేస్తాను. సరే...ఏదో ఒహాటి చేద్దాం లెండి.. వస్తా" అని వెళ్ళిపోయాడు.

ఆవేళ సాయంత్రం కొత్తరోడ్డువైపు అపూర్వబాబు నడవడం నిజంగా అపూర్వమే! అపూర్వబాబు ఎప్పుడూ ఆరోడ్డు వైపు పోలేదు. పంతులమ్మ ఇంటికి సరాసరి వెళ్లాడు. పంతులమ్మ నవ్వుతూ ఆహ్వానించింది అపూర్వబాబును. అపూర్వబాబుకు వేడి కాఫీ ఇచ్చింది. తియ్యగామాట్లాడింది, అపూర్వబాబు, తనంటే పంతులమ్మ కెంతో గౌరవం అనుకున్నాడు. తన అభిప్రాయాన్ని ఎలా చెప్పాలో తోచక తికమకపడ్డాడు. ఏమైనా తన ఉద్దేశ్యాన్ని ఆమెకు తెలియచేయాలనే నిశ్చయానికి వచ్చాడు.

"చూడండీ! నేను అతిముఖ్యమైన ఒక విషయాన్ని మీతో మాట్లాడ్డానికివచ్చాను" అని మొదలు పెట్టాడు అపూర్వబాబు.

"మాట్లాడండి! అలాగే," అంది పంతులమ్మ జడ చివరన రిబ్బనుతో ముడిపెడుతూ.

"చూడండీ! మీకు తగినంత వయస్సు వచ్చింది. పైగా పంతులమ్మగారు. కనక మీతో మాట్లాడ్డానికి కొంత సున్నితమైన విషయమైనా ధైర్యంగా మాట్లాడ ప్రయత్నించాను."

"ఏమిటది?"

"మీ పెళ్ళిమాట" అపూర్వబాబు పంతులమ్మవైపు చూడలేదు. పంతులమ్మ వెంటనే

"చూడండీ! అపూర్వబాబుగారూ! మీరు చెప్పిన మాటలనుబట్టి విషయం అర్థం చేసుకున్నాను. సాంఘిక మర్యాదలను నేను పాటిస్తాను. మాతండ్రిని కలుసుకోండి. ఆయన అంగీకరిస్తే...నా అభ్యంతరం ఉండదు." అపూర్వబాబు చెంగున లేచాడు సరేనంటూ. "వస్తానని" వెంటనే వెళ్ళిపోయాడు.

"నెమ్మదస్తుడు అపూర్వబాబు" అనుకొంది. అంతే!

మర్నాడు మధ్యాహ్నం రామం పంతులమ్మ ఇంటికి వెళ్లాడు. ప్రయాణానికి ఆమెను సిద్ధపరచాడు. ఇద్దరూ స్టేషనువైపు వెళ్లారు. రామం ఏదో మాట్లాడ్డానికి ప్రయత్నించి 'ఇప్పుడెందుకులే' అన్నట్లున్నాడు. ఏవేవో మాట్లాడాడు పిచ్చిగా. పంతులమ్మ యాదాలాపంగా వింటేగాని నవ్వలేదు. తుళ్లిలేదు. పంతులమ్మ మరో దృష్టిలో ఉంది. రామం మెదడు వేరేవిధంగా పని చేస్తోంది. ఎందుకో అతడు సతమత మవుతున్నాడు. అపూర్వబాబును, రామానికి దగ్గర పెట్టి ఆలోచిస్తోంది. దృష్టి రామంమీదకన్న అపూర్వబాబువైపే పోతున్నది. కాని అపూర్వబాబు పేరును అసలు రామంతో మాట్లాడినప్పుడు తేనే లేదు. రామం పంతులమ్మను రైలు ఎక్కించాడు. ఒక్క తెలివైన పనిచేశాడు రామం. కిటికీ ప్రక్కకూర్చున పంతులమ్మతో కరచాలనం ధైర్యంగా సాహసించి చేశాడు రైలుకదులుతోంటే.

ఆదివారం సాయంత్రం స్టేషనులో పచారుచేస్తున్నాడు రామం. రైలువచ్చింది. పంతులమ్మ దిగుతోంది. పంతులమ్మను ఎదుర్కొన్నాడు. పంతులమ్మ నవ్వింది. రామానికి ఎంతో బలం వచ్చినట్లనిపించింది. అంత మందిజనంలో, బ్రహ్మాండమైన ప్లాట్ ఫారం మీద రామం రహస్యంగా అన్నాడు... "మీరు అలా నవ్వకండి. భరించలేను." పంతులమ్మ పెదిమలు తడిచేసుకొని నవ్వింది. ఎందుకో రామంఅంటే అభిమానం ఏర్పడ్డది.




## 1957లో మీ యొక్క అదృష్టము

ఒక పోస్టు కార్డుపైన నీకిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీ చిరునామాయున్నూ వ్రాసిపంపినచో రాబోవు 12 మాసములలోను నీ జీవితవిశేషాలను అనగా వ్యాపారంలో లాభనష్టములు, ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, సంతానము, వివాహసౌఖ్యములు, ఆరోగ్య విషయము మొదలగు వాటిని గురించి స్పష్టముగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము (పోస్టేజి ఛార్జీలు ప్రత్యేకం.) దుష్టగ్రహములు లేవైన యున్న నివారణచేసికొనుటకు తగు విధానంకూడా తెలుపబడును. ఒకసారి పరీక్షించి చూడుడు.

PARSIDH JYOTISH KARYALA (A. W.)
Kamla Market, New Delhi.

మళ్లీ నవ్వింది. రామం లోలోపల గంతులు వేసాడు. పంతులమ్మ ఎన్నో కబుర్లు చెప్పింది. అవన్నీ రామానికి ఇప్పటికీ జ్ఞాపకమే !

ఒకనాడు సాయంత్రం అపూర్వబాబు పంతులమ్మ ఇంటికి వెళ్లాడు. పంతులమ్మ నవ్వుతూ ఆహ్వానించింది. అపూర్వబాబు క్షణంకూర్చుని లేచి నుంచొని...“మీరు కోరినట్టు, నేను ఈ వేళ, మీ నాన్న గార్ని కలుసు కున్నాను.”

“మీరు మా ఊరు వెళ్ళారా ?” ఆశ్చర్యంగా అడిగింది.

“అవును వెళ్ళాను. ఆయన అభ్యంతర మేమీ లేదన్నాడిందులో!”

“కాని... నేను అభిప్రాయాన్ని మార్చుకున్నాను.” పంతులమ్మ మిక్కిలి నింపాదిగా అంది.

అపూర్వబాబు తగని ఆశ్చర్యం పోయాడు. కోపంతో

“వేళాకోళ మనుకున్నారా? ఒకమాటు అభిప్రాయాన్ని వెలిబుచ్చడానికీ ... అది కాదంటూ తిరిగి చెప్పడానికీ.

“అదికాదు నేనంట...పూర్వం పరిస్థితి వేరు. ఇప్పటి పరిస్థితి వేరు.”

“ఏమొచ్చింది పరిస్థితికి. నేనేమయినా మారానా లేక మీరు మారారా?”

“నేనే మారాను.”

“క్షణక్షణానికి మీలో మార్పు వుంటుందని నేను ఊహించలేకపోయాను.”

“పోని...ఇప్పుడనుకోండి. మించి పోయిందిలేదు.”

“అవును. మించిపోయిందిలేదు. నన్ను వెక్కిరించకండి; చదువుకున్నవారు. ఏదో కొత్త మాట విలువ తెలుసనుకున్నాను.”

“ఏమిటి మీర నేది?”

“అవును ఇదివరకు మీరన్న దేమిటి? ఎందుకు మీ నాన్నగార్ని కలుసుకో మన్నారు? ఉట్టి అపామాషీకా? బడిపిల్లలు ఆడుకునే ఆటనుకున్నారా? మీమీద మీకే నమ్మకం లేదు.”

పంతులమ్మ విసిగిపోయింది.

“ఇప్పుడు నన్ను ఏం చేయమంటారు?”

“ఏం చేయమంటే మాత్రం ఏం చేస్తారు మీరు. మాటల్ని చాలా తేలిగ్గా అనగలుగుతారు. అంత తేలిగ్గానూ వదలేస్తారు. ఒకమాట మనం అన్నాక, దానిని మంచో, చెడ్డో, తిరిగి వాపసు చేసుకోవడం మంచి పద్ధతి కాదు.”

అపూర్వబాబు మాట్లాడ్డం తీరు పంతులమ్మను కదలించింది.

“అపూర్వబాబుగారూ ! నేను అంగీకరిస్తున్నాను. మీ ఇష్టం సరేనా?”

“నేను అంగీకరించవలసిందిగా బలవంతం మాత్రం చేయలేను.”

“ఏమైనా, మీకు అభిమతమైన సమాధానం ఇచ్చినప్పుడు; సమాధానం పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకో ప్రయత్నించకండి. నాకు విశ్రాంతి ఇమ్మనికోరుతున్నాను.” పంతులమ్మ ప్రాధేయపడింది.

“వెళ్లమని కోరడం లేదూ ?” అపూర్వబాబు నవ్వుతూ అన్నాడు.

“క్షమించండి. ఇప్పుడు నవ్వలేను.” పంతులమ్మ శూన్యంలోకి చూస్తుండగా అపూర్వబాబు వెళ్ళిపోయాడు. పంతులమ్మ ఏదో ఆలోచిస్తోంది.

రెండు క్షణాలు గడిచాక జమీందారు కూతురు పద్మ వచ్చింది. పద్మకు ఎనిమిదేళ్ళుంటాయి. పంతులమ్మకు పద్మ అంటే ఎంతో ఇష్టం. పేలవంగా నవ్వింది పద్మను చూచి. పద్మను చేతుల్లోకి తీసుకొంది.

“బాబాయి ఇచ్చాడు” అని ఒక కవరు ఇచ్చింది. కవరు చించి లోని కాగితాన్ని తీసి చదువుతుండగా పద్మ వెళ్ళిపోయింది.

“ముఖాముఖీని మాట్లాడవలసిన ముఖ్య విషయమైనా, తగిన సాహసం లేక ఉత్తరం ద్వారా తెలియచేస్తున్నాను. మిమ్మల్ని ప్రేమిస్తున్నాను...మీరుకూడా ...అనుకొని ఏమైనా పున్నయ్యగారు, నా గురించి, చేసిన పరిచయ వాక్యాలు మరిచిపోలేదనుకుంటా. మీ రేమాటా తిరిగి జాబుద్వారా తెలియచేయగలరనుకొనే...కామేశం.”

“కామేశం ! పున్నయ్యగారికీ పరిచయ వాక్యాలు !! ప్రేమ !!!” అనుకొంది. వెంటనే కాగితం తీసి కలం పుచ్చుకొంది పంతులమ్మ. విసురుగా వ్రాయబోయింది. కాని మరుక్షణంలోనే మెళ్లో బంగారు గొలుసు, బంగారు బొత్తాలు, రాళ్లతో పొదగబడిన బంగారు వాచీనేను... ఇవన్నీ కనబడ్డాయి. అవును కామేశాన్ని పెళ్ళి చేసుకుంటే. వెంటనే ఎగిరి కామేశం మేడ మీద చివరగదిలో ముఖమల్ పరుపుపై పడ్డట్లనిపించింది పంతులమ్మకు. వెంటనే ఏమీ తెలియని రామం, అన్నీ తెలిసిన అపూర్వబాబు, జమీందారు తమ్ముడు కామేశం ముగ్గురూ నిలబడ్డట్టయింది. పంతులమ్మ ఎటూ నిర్ధారణ చేసుకోలేకపోయింది. ఇది ఒక విషమ సమస్య అనుకొంది.

ఏమీ తెలియని రామంకు చదువు మధ్యలో ఆగిపోయింది. ఉద్యోగం లేదు. కనీసం ఆస్తి లేదు.

అన్నీ తెలిసిన అపూర్వబాబు మధ్య తరగతివాడు.

జమీందారు కామేశం జమీందారు, ఫరవాలేదు. కాని హృదయం లేదు. సంస్కారం లేదు. అతడే చెపుతున్నాడు తనని చూచి కాదు ప్రేమించమనేది, తన ధనాన్ని చూసి.

పంతులమ్మకు దిక్కు తెలియక శూన్యంలోకి చూస్తూ చాలా సేపుండిపోయింది.

పంతులమ్మ కామేశానికి ఉత్తరం వ్రాసింది. “చూడండీ! నేను మీకు ఈ ఉత్తరం వ్రాయవలసి వచ్చినందుకు విచారిస్తున్నాను నిజంగా. నేను, డబ్బునకంటే మనిషినే ఎక్కువ ప్రేమించగలనని అనుకుంటాను. మీరు ఏమీ అనుకోకండి. పంతులమ్మ.”

అపూర్వబాబు, రామం కలుసుకోవడం నిజంగా ఆశ్చర్యం, దైవికం. కలుసుకొన్నా అంతతో ఆగిపోక, ఆమాట, ఈమాటలలో పంతులమ్మను తాను ప్రేమిస్తున్నట్లు, పెళ్ళాడదలచినట్లు చెప్పాడు. అపూర్వబాబు ఆశ్చర్యానికి అంతులేదు. అందుకే పంతులమ్మ ఆనాడు ఆ పరిస్థితి వేరంది.

“పంతులమ్మ నిన్ను ప్రేమిస్తోందా ?”


జీవితంలో మహోల్లాసం

కాల్గేట్

బొరేటెడ్

బేబీపౌడర్ వాడకంతో




..అందుచేతనే, విజ్ఞులైన తల్లులు తమ పిల్లల అతి సుకుమార శరీరాన్ని బాధాకరమైన చర్మవ్యాధులు సోకకుండా రక్షించడానికిగాను కాల్గేట్ బొరేటెడ్ బేబీ పౌడర్ వాడతారు అతి సున్నితమైన శరీరాలను మృదువుగా, లాలిత్యంగా వుంచడానికి శాస్త్రీయ పద్ధతులపై తయారుచేయబడింది. తాపమెక్కి ఎండ వేడిమికి చర్మం పెట్లకుండా కాపాడుతుంది - ...రోజంతా చల్లదనమిచ్చి, పిల్లలు సుఖంగా వుండడాని కుపకరిస్తుంది. దాని కమ్మని వాసన మిమ్ము, మీ పిల్లలను సమ్మోహితులను చేస్తుంది.

ఆదాకు జెయింట్ సైజు కొనండి

# ★ చక్కలిగింతలు ★

"పూర్తిగా" తల ఊపుతూ అన్నాడు రామం. రామం వెళ్ళిపోయాక అపూర్వబాబు చాలాసేపు ఆలోచించాడు. రామానికీ, పంతులమ్మకు మధ్య తను నిలబడ్డం తనకే నచ్చలేదు. వెంటనే పంతులమ్మకు ఉత్తరం వ్రాశాడు. 'చూడండీ!' అంటూ.

"చూడండి. నేను బలవంతంగా మిమ్మల్ని 'నాదాన్ని'గా చేసుకో లేని కారణంగా నా అభిప్రాయాన్ని మార్చుకున్నాను. మీరు ప్రేమించిన వాణ్ణే మీరు స్వీకరించండి. ఇంతే...అపూర్వబాబు."

పంతులమ్మ తగని ఆశ్చర్యం పడింది. అపూర్వబాబు మారి పోవడానికి...ఇదంతా ఏమిటో...కారణం తెలియదు. కాని ఒక టనుకొంది. అపూర్వబాబు చాలా చిత్రమయినవాడు. ఇదంతా కామేశం కుట్ర. వెంటనే పంతులమ్మ అపూర్వబాబుకు ఒక ఉత్తరం వ్రాసింది.

"చూడండీ! నా అభిప్రాయానికి తిరిగి మార్పు కలిగే లోపలే మీరన్న మాటను వాపసు చేసుకోవడమే చిత్రం. తిరిగి, మీరు మళ్ళీ ఇది కాదంటూ అనరనుకుంటాను. నేను ఇంతవరకూ, ఏ ఒక్కర్నీ ఇదమిద్ధంగా ప్రేమించలేదంటే మీకు ఆశ్చర్యంగా ఉండడంలో ఆశ్చర్యమేమీ ఉండదు. పైగా, కాస్త నేను దూరంగా వెళ్ళింది మీతోనే అని చెప్ప వలసివచ్చింది. జరిగిందంతా ఒక చిత్రమయిన కలగా, అనుభూతిగా అనుకొని మరిచిపొండి...పంతులమ్మ."

అపూర్వబాబు పంతులమ్మ ఉత్తరం చూచి ఆశ్చర్యపోలేదు. కాని కొండలు పగిలే కోపం వచ్చింది. అది రామంమీద. "దొంగవేషం!" పళ్ళు పటపటలాడాయి. రామానికి కబురు పెట్టాడు.

రామం వచ్చాడు.

"నువ్వు దొంగవి. అబద్ధాల కోరువి. పట్ట పగలు, నిర్భయంగా మోసం చేయడానికి నువ్వు వెరవవు? నీకు ఒకర్ని మోసం చేయొచ్చు, మరి ఒకర్ని చేయకూడదనే వివక్షత లేదు. నువ్వు నాతో పందెం వేసి నన్ను పడగొట్టదల్చావు. నీదగా పనిచేసింది."

"ఏమిటి మీరనేది" రామానికి మతి పోయింది.

అపూర్వబాబు కొరకొర చూచాడు. మాట్లాడలేదు. నుంచున్నాడు కోపంతో మొహం జేవురించింది. రామం భయపడలేదు. రామంకూడా నుంచున్నాడు. అపూర్వబాబు కళ్ళను చూడలేక పోతున్నాడు రామం.

"ఏమిటి మీరనేది?"

అపూర్వబాబు మాట్లాడలేదు. రామాన్ని సమీపించాడు. చొక్కాను లాగి గుప్పెటలో అదిమి సాచి దవడమీద పెట్టాడు. రామం ఈ సారి కూడా మాట్లాడలేదు.

"ఇందుకేనా మీరు పిలిచింది?"

"నువ్వు పంతులమ్మను ప్రేమిస్తున్నావా? కాదు పంతులమ్మ నిన్ను ప్రేమిస్తోందా?"

"ఏం? లేదా?"

"పంతులమ్మ చెప్పింది."

"పోన్లెండి. మంచిది వస్తాను. కాని ఒకటి పంతులమ్మ నన్ను ప్రేమించని కారణంగా కొట్టారని నేను అనుకోను."

అపూర్వబాబు ఆశ్చర్యపోయాడు రామం నెమ్మదికి.

"నన్ను క్షమించు రామం" అన్నాడు. అపూర్వబాబు.

అపూర్వబాబును చూస్తుంటే రామానికి 'జలసీ' భగుమన్నది. అపూర్వబాబును పంతులమ్మ ప్రేమిస్తోందా? తనను ప్రేమించ వట్లు అపూర్వబాబు కెట్లా తెలుసు?

రామం వెంటనే పంతులమ్మను కలుసుకొన్నాడు. జలసీతో కుమిలిపోతున్నాడు రామం. పంతులమ్మ నవ్వు రెండు ముక్కలుగా చీలి ప్రవహించినట్లనిపించింది. పంతులమ్మ భయపడింది రామం తీరుమాస్తే.

"ఏమిటండీ!" అంది.

"నటన! మోసం! ఆకళ్ళు ఎంతకుళ్ళునైనా దాచగలవు" అనుకొన్నాడు రామం.

"ఏమీ లేదు."

"బాగుంది మాట!"

"ఏం? నీ అంతనేర్పరిని కాదా"

"ఏమిటో మీరనేది?"

"ఏమంటావు నువ్వు ఒకేసారు రెండు పాత్రలను అభినయించ గలవ్."

"నాకర్థ మయింది ... మీరనవసరంగా ఇదవకండి మీరు పూర్వం రామం లాగా ఉండండి."

ఏమిటీ నాటకం? ఎందుకు నన్ను ఇలా పిచ్చివాణ్ని చేయడం? అపూర్వబాబును ప్రేమిస్తున్నానంటె పోయేదిగా?

"నేనుఅందర్నీ ప్రేమిస్తున్నాను. అందర్నీ ప్రేమించడంలేదు. నాకు నేను ఏనిర్ణయం చేసుకోకుండానే మీలోమీరు కీచులాడుకున్నారు. నాకు తోచనిస్తేకదా? నేను వచ్చింది లగాయితు అందరూ ఒక్కలా ఉన్నారు."

"అందరూ"

"అవును మీరు అనుకున్నది రెండు పాత్రలే! కాదు మూడో వారు ఒకరున్నారు."

రామం ఆశ్చర్యపోయి..."కామేశమా?"

"అవును ఏం?"

"ఏమీ లేదు... ఇప్పుడేమంటావు?"

"నేనేమీ అనను. కాలమే నిర్ణయిస్తుంది. ఓపిక పట్టండి...అంతే...కాఫీ పుచ్చుకొంటారా?"

"మీరిదివరకు పెట్టిన గిలిగింతలు చాలకనా?"

"మీరు అలా భావిస్తున్నారు అంతే! మర్యాదను వేరొకలా అర్థం చేసుకొంటే నేనేం చేసేది?"

"నాకేమీ అర్థంకాదు. నేను వస్తాను."

"వెళ్ళిరండి...కాని మీకు కూడా ఒకటి చెప్పదలచుకున్నాను. జరిగినదంతా ఒక విచిత్రమైన కలగా, అనుభూతిగా మాత్రమే భావించి మరచిపోవడానికి ప్రయత్నించండి."

"అది మీకు వీలవుతుందేమో..."

"నేను మీలా ఇతరులను గురించి పొరపడను."

"నేను పొరపడ్డానంటారా?... ఏమో! నిజమేనేమో! అవును... అర్థమయింది... వస్తాను."

పంతులమ్మ ట్రాన్స్‌ఫర్‌కు అప్లికేషన్ పెట్టి శెలవు పెట్టి ఊరువదలి వెళ్ళింది. పంతులమ్మ పెట్టిన గిలిగింతలు ఇంకా జ్ఞాపకానికి వస్తూనే ఉంటాయేమో ముఖ్యంగా అపూర్వబాబుకూ, రామానికీను! పంతులమ్మ సెలవు నుంచి తిరిగి రాకుండానే బదిలీ కాగితం వచ్చినట్టు బసవపున్నయ్యగారు తర్వాత చెప్పారు. బసవపున్నయ్యగారికి నిజంగా తెలియదు పంతులమ్మ బదిలీ కోరడానికి కారణం! ★


## తెల్ల వెంట్రుకలుండవు
(GOVT REGD).

రంగులనుచూచి మోసపోవద్దు, అది తాత్కాలికము. మా సువాసన "విశ్వకళ్యాన్ తైలం" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది. 50 సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనమునిచ్చును ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధి చేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 5/- 3 సీసాలు రు. 12, సగము నెరసి వుంటే ఒకసీసా రు.6/- 3 సీసాలు రు.15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/- లు పని చేయలేదని బుజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి ఫ్రీ.

MODERN DRUGS CORPN,
(106) P., O. Pakribardwan (Gaya)